AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN

12-11-2025 (Wednesday) | MAIN EDITION

## సివిల్స్ ఫలితాలు విడుదల




**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్:** సివిల్స్ ఫలితాలు విడుదల అయ్యాయి. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆగస్టు 22 నుంచి ఆగస్టు 31 వరకు సివిల్స్ మెయిన్స్ పరీక్షలు నిర్వహించింది. వాటి ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. అభ్యర్థుల పర్సనాలిటీ టెస్ట్‌ల ఈసమ్మన్ లెటర్స్ (ఇంటర్వ్యూలు) అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. కాగా యూపీఎస్సీ ఇంటర్వ్యూకు 2,736 మంది అభ్యర్థులు విజయవంతంగా అర్హత సాధించారు. అధికారిక నోటిఫికేషన్ ప్రకారం కోర్టు కేసుల కారణంగా ముగ్గురు అభ్యర్థుల ఫలితాలు నిలిపివేయబడ్డాయి.

## ఢిల్లీలో మళ్లీ పడిపోయిన గాలి నాణ్యత..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత మరోసారి తీవ్రమైన స్థాయికి పడిపోయింది. దీంతో 'ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్' కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఢిల్లీఎన్‌సీఆర్ ప్రాంతంలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ దశ 3 అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు సమాచారం ప్రకారం.. సోమవారం ఢిల్లీలో వాయు నాణ్యత సూచి 362గా ఉండగా.. మంగళవారం ఉదయం 7 గంటలకు అది 425కు చేరింది.

## నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి



**అక్షరటుడే, హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం రాత్రి ఢిల్లీకి వెళ్లనున్నారు. ఇండో యుఎస్ కంపెనీల ప్రతినిధులతో గురువారం ఆయన సమావేశం అవుతారు. తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించనున్నారు. అలాగే వారిని డిసెంబర్ 8, 9న హైదరాబాద్‌లో జరిగే గ్లోబల్ సమ్మిట్‌కు ముఖ్యమంత్రి ఆహ్వానించనున్నారు.

## అలా అయితేనే బంగ్లాదేశ్‌కు తిరిగొస్తా



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** తాను స్వదేశానికి తిరిగి రావాలంటే బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని భారత్‌లో ఆశ్రయం పొందుతున్న ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా ఆ దేశానికి షరతు పెట్టారు. బంగ్లాలో అవామీ లీగ్ పార్టీపై నిషేధం ఎత్తివేత, స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికలను నిర్వహించినప్పుడే తాను తిరిగివెళ్తానన్నారు.

## బాధితులకు ప్రధాని మోదీ పరామర్శ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో చోటుచేసుకున్న కారు పేలుడు ఘటనలో గాయపడిన వారిని ప్రధాని మోదీ పరామర్శించారు. భూటాన్ పర్యటన ముగించుకుని స్వదేశానికి చేరుకున్న వెంటనే నేరుగా ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి వెళ్లారు. గాయపడిన వారితో మాట్లాడారు. క్షతగాత్రుల పరిస్థితిని వైద్యులు ఆయనకు వివరించారు.

# కారులో కంగారు!




**రాష్ట్ర రాజకీయాలను వేడెక్కించిన జూబ్లీహిల్స్ సమరం ముగిసింది. ఓటర్ తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఈ నెల 14న ఫలితం వెల్లడి కానుంది. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీలు తమ విజయావకాశాలపై లెక్కలు వేసుకుంటున్నాయి. అయితే, కాంగ్రెస్ పార్టీ జోష్‌లో నెలకొనగా, బీఆర్ఎస్‌లో మాత్రం కలవరం కనిపిస్తోంది. ఎగ్జిట్ పోల్ ఫలితాలే అందుకు కారణం. సర్వేలన్నీ అధికార పార్టీ గెలుస్తుందని స్పష్టంగా తేల్చి చెప్పాయి. ఉప ఎన్నికలో కాంగ్రెస్ సంపూర్ణ ఆధిపత్యం చాటుకుందని స్పష్టం చేశాయి. బీఆర్ఎస్ సర్వశక్తులూ ఒడ్డినప్పటికీ, పోల్ మేనేజ్‌మెంట్‌లో వెనుకబడడంతో రెండో స్థానానికి పరిమితమ వుతుందని వెల్లడించాయి. తొలి నుంచి అందరూ భావిస్తున్నట్లే బీజేపీ మూడో స్థానానికే పరిమతం కానుందని పేర్కొన్నాయి.**

**-అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

**▪ జూబ్లీ'పల్స్' కాంగ్రెస్ వైపే.. ▪ అన్నీ సర్వేలు చెప్పిందదే.. ▪ ఆందోళనలో బీఆర్ఎస్ శ్రేణులు**

దాదాపు నెల రోజులుగా ప్రచారంలో బిజీబిజీగా గడిపిన ప్రధాన పార్టీల నేతలు ఓట్ల లెక్కలపై దృష్టి సారించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఈసారి కూడా సగం కంటే తక్కువగా ఓటింగ్ జరిగింది. 48.47 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 47.58 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి దాదాపు ఒక్క శాతం మాత్రమే పెరిగింది. దీంతో ఎవరికి ఎన్ని ఓట్లు వేస్తాయనే లెక్కల్లో అభ్యర్థులు మునిగి తేలారు. ఏయే డివిజన్లలో తమకు ఎన్ని ఓట్లు వస్తాయో లెక్కగడుతున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పోలింగ్ జరిగిన తీరుతో పాటు ఓటర్ల మనోగతాన్ని తెలుసుకుని లెక్కలు వేసుకుంటున్నాయి. వీటి ఆధారంగా గెలుపు ఓటములపై అంచనాకు వస్తున్నాయి.

### నిస్తేజంలో బీఆర్ఎస్..

ఎగ్జిట్ పోల్ ఫలితాలు కాంగ్రెస్‌లో సరికొత్త జోష్ నింపాయి. అధికార పార్టీ గెలుస్తుందని అన్ని సర్వేలు వెల్లడించిన నేపథ్యంలో అధికార పార్టీలో ఉత్సాహం కనిపిస్తోంది. అదే సమయంలో బీఆర్ఎసలో నైరాశ్యం అలుముకుంది. అందరి కంటే ముందే అభ్యర్థిని ప్రకటించిన గులాబీ పార్టీ.. ప్రచారంలోనూ దూసుకెళ్లింది. తొలినాళ్లలో కేటీఆర్, హరీశ్‌రావు ఉధృతంగా ప్రచారం నిర్వహించినా, ఎన్నిక గడువు సమీపిస్తున్న కొద్దీ రాజకీయ పరిణామాలు ప్రతికూలంగా మారాయి. ప్రధానంగా దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతిపై ఆయన కన్నతల్లి అనుమానాలు వ్యక్తం చేయడం, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై పలు ఆరోపణలు రావడం ఇబ్బందికరంగా మారింది. అదే సమయంలో కేటీఆర్‌పై అనేక ఆరోపణలు రావడంతో బీఆర్ఎస్ సరైన కౌంటర్ ఇవ్వలేక సందిగ్ధంలో పడిపోయింది. మరోవైపు, పార్టీ అధినేత కేసీఆర్ ప్రచారానికి రాకపోవడం గులాబీ పార్టీకి మైనస్‌గా మారింది. ఇప్పటికీ ప్రజల్లో ఆయనపై ప్రత్యేక అభిమానం ఉంది. కానీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన బయటకు రావడం లేదు. ఒకవేళ కేసీఆర్ ప్రచారం చేసి ఉంటే పార్టీకి ఎంతో మేలు కలిగేది. కానీ ఆయన రాలేదు. ఇక, పోల్ మేనేజ్‌మెంట్‌లోనూ బీఆర్ఎస్ వెనుకబడింది. కేవలం మీడియా, సోషల్ మీడియాను మాత్రమే నమ్ముకున్న కేటీఆర్.. పోల్ మేనేజ్‌మెంట్‌పై పూర్తి స్థాయిలో దృష్టి సారించలేక పోయారు. ఇలా అనేక కారణాల వల్ల ఆ పార్టీకి ఓటమి తప్పదని ఎగ్జిట్ పోల్స్ తేల్చి చెప్పాయి.

## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై కేసు నమోదు..



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా మంగళవారం ఆయన హల్‌చల్ చేశారు. యూసుఫ్‌గూడలో మహమ్మద్ ఫంక్షన్ హాల్‌లోకి చొచ్చుకొని వెళ్లారు. పోలీసులు వద్దని చెప్పినా వినకుండా అనుచరులతో కలిసి కౌశిక్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లోకి వెళ్లారు. దీంతో ఉద్రిక్తతలు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారంటూ ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## మూడు లక్షల ఇళ్లను ప్రారంభించిన ఏపీ సీఎం



**అక్షరటుడే, అమరావతి :** పేదలందరికీ 2029 వరకు ఇల్లు ఉండాలన్నదే తమ లక్ష్యమని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం దేవగూడపల్లిలో ఆయన బుధవారం పర్యటించారు. పేదల కోసం నిర్మించిన ఎన్టీఆర్ పక్కా గృహాలను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఎన్టీఆర్ పక్కా గృహాలను ప్రారంభించారు. చంద్రబాబు గ్రామంలో పలువురికి కొత్త ఇంటి తాళాలు అప్పగించారు.

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ వాయిదా



**అక్షరటుడే, హైదరాబాద్:** ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణను స్పీకర్ కార్యాలయం వాయిదా వేసింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పది మందిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై సుప్రీంకోర్టు తీర్పు మేరకు స్పీకర్ విచారణ చేపడుతున్నారు. అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని జులై 31న సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఈ క్రమంలో స్పీకర్ గతంలో నలుగురు ఎమ్మెల్యే లను విచారించారు. ఈ నెల 6, 7 తేదీల్లో రెండో విడతలో మరో నలుగురిని విచారించారు. వారిని మళ్లీ ఈ నెల 12, 13 తేదీల్లో విచారించాల్సి ఉంది. అయితే ఇవాళ, రేపు జరగాల్సిన విచారణను వాయిదా వేసినట్లు స్పీకర్ కార్యాలయం తెలిపింది. ఈ నెల 14, 15 తేదీల్లో విచారిస్తామని వెల్లడించింది.

## వర్సిటీల్లో విద్యార్థి ఎన్నికలు పెట్టాలి



**అక్షరటుడే, నల్గొండ:** రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో విద్యార్థి ఎన్నికలు పెట్టాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. జనంబాట కార్యక్రమంలో భాగంగా ఆమె బుధవారం నల్గొండ జిల్లాలో పర్యటించారు. కవిత నల్గొండ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. రోగులతో మాట్లాడారు. సిబ్బంది సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి ఎన్నికలు కొత్త నాయకులను తయారు చేస్తాయన్నారు. కానీ చంద్రబాబు నాయుడు హయాంలో అలాంటి ఎన్నికలు రద్దు చేశారని ఆమె పేర్కొన్నారు. దీంతో ప్రస్తుతం రాజకీయ నాయకుల పిల్లలకు మాత్రమే పొలిటిక్స్‌లో అవకాశాలు వస్తున్నాయన్నారు. మిగతా వారికి ఛాన్స్‌లు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీల్లో ఎన్నికలు పెడితే కొత్త తరం రాజకీయ నాయకులు తయారు అవుతారని చెప్పారు.

## మంత్రి తుమ్మల ఆకస్మిక తనిఖీలు



**అక్షరటుడే, హైదరాబాద్:** వ్యవసాయ, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు షాక్ ఇస్తున్నారు. తన శాఖల పరిధిలోని కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. నాంపల్లిలోని చేనేత భవన్‌లో మంత్రి తుమ్మల బుధవారం ఉదయం తనిఖీలు చేపట్టారు. ఉదయం 10:30 గంటలకు వరకు కూడా కొందరు ఉద్యోగులు విధులకు హాజరు కాలేదు. టైంకి రాని ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. మంత్రి తుమ్మల గతంలో సైతం పలు కార్యాలయాలను ఇలాగే తనిఖీ చేశారు.

## ఢిల్లీ పేలుడు ఘటన.. మౌల్వీ ఇర్ఫాన్ అరెస్ట్



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** ఢిల్లీ పేలుడు ఘటనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. వైద్యులను ఉగ్రవాదులుగా మారుస్తున్న మౌల్వీ ఇర్ఫాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఢిల్లీ ఎర్రకోట సమీపంలో సోమవారం సాయంత్రం కారులో పేలుడు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఇప్పటి వరకు 13 మంది మృతి చెందారు. ఢిల్లీ ఘటన వెనుక డాక్టర్ ఉమర్ కీలక సూత్రధారి అని పోలీసులు ఇదివరకే గుర్తిం చారు. అయితే దేశవ్యాప్తంగా పలువురు వైద్యులు భారీ ఉగ్రకుట్రకు యత్నించిన విషయం తెలిసిందే. ఫరీదాబాద్ వైట్ కాలర్ ఉగ్ర మాడ్యూల్ గుట్టును భద్రతా బలగాలు రట్టు చేశాయి. జైషే మొహమ్మద్, అన్సార్ ఘజ్‌వాత్-ఉల్-హింద్ ఉగ్రసంస్థలతో సంబంధాలున్న ముగ్గురు వైద్యులుసహా మొత్తం ఎనిమిది మంది ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ఈ వైట్ కాలర్ ఉగ్రమాడ్యుల్ వెనక కీలక పాత్రధారిగా జమ్మూకశ్మీర్‌షోపియాన్‌కు చెందిన మౌల్వీ ఇర్ఫాన్ ఉన్నట్లు భద్రతా సంస్థలు గుర్తించాయి. వైద్య విద్యార్థులను ఉగ్రవాదులుగా మార్చడంలో అతడు కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. తాజాగా అతడిని అరెస్ట్ చేశారు.

## గువాహటి టెస్ట్ షెడ్యూల్‌లో బీసీసీఐ కీలక మార్పులు

**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** టీమిండియా మరోసారి సొంత గడ్డపై టెస్ట్ సిరీస్‌కు సిద్ధమైంది. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో భారత్, సౌతాఫ్రికా జట్లు తలపడబోతున్నాయి. ఈ సిరీస్‌లో తొలి టెస్టు నవంబర్ 14న కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో ప్రారంభం కానుండగా, రెండో టెస్టు నవంబర్ 22 నుంచి అసోం రాష్ట్రంలోని గువాహటిలో జరగనుంది. అయితే బీసీసీఐ మ్యాచ్ సమయంలో మార్పులు చేసింది. ఈశాన్య భారతదేశంలో శీతాకాలంలో సాయంత్రం వేళల్లో త్వరగా చీకటి పడుతుందని గుర్తించింది. దీంతో ఉదయం 9 గంటలకే మ్యాచ్‌ను ప్రారంభించి సాయంత్రం 4 గంటలకు ముగించనుంది. అవసరమైతే ఆటను 4.30 గంటల వరకు పొడిగిస్తారు. కాగా.. ఈ సిరీస్ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు మూడో సిరీస్ కాగా, సౌతాఫ్రికాకు రెండోది. ఇప్పటి వరకు భారత్ ఇంగ్లాండ్‌తో వారి గడ్డపై 2-2తో సిరీస్ డ్రా చేసుకోగా, విండీస్‌ను 2-0 తేడాతో ఓడించింది. మరోవైపు సౌతాఫ్రికా పాకిస్థాన్‌తో 1-1తో సిరీస్‌ను ముగించింది. డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ముందంజలో నిలవాలంటే ఇరు జట్లకీ సిరీస్ కీలకం కానుంది.

## ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ప్రారంభించిన టాటా



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ఎలక్ట్రిక్ వాహనదారులకు టాటా గుడ్ న్యూస్ చెప్పింది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన రహదారులపై 14 ఈవీ మ్యాన్డ్ మెగా ఛార్జర్ పాయింట్లను ప్రారంభించింది. ఇందుకోసం టాటా ఈవీ వోల్ట్రాన్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ పెరిగింది. ప్రజలు ద్విచక్ర వాహనాలు నుంచి కార్ల వరకు ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. అయితే ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులో లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో టాటా ఛార్జింగ్ స్టేషన్లను అందుబాటులోకి తెచ్చింది.

## స్పెషల్ సాంగ్‌లో మెరిసేందుకు సిద్ధమైన మిల్కీ బ్యూటీ !



టాలీవుడ్ మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా కెరీర్ రెండు దశాబ్దాలు దాటిపోయినా, ఆమె క్రేజ్ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. తెలుగు సినిమాల్లో హీరోయిన్‌గా కొనసాగుతూనే స్పెషల్ సాంగ్స్ ద్వారా కూడా తమన్నా ఒక ప్రత్యేకమైన ఇమేజ్ తెచ్చుకుంది. ఒక దశలో "ఐటెం సాంగ్ అంటే తమన్నానే!" అన్నంత పాపులారిటీ సంపాదించింది. అయితే కొంతకాలంగా తెలుగు తెరపై ఆమె స్పెషల్ సాంగ్స్ కనిపించకపోవడంతో అభిమానులు నిరాశ చెందుతున్నారు. ఇప్పుడు ఆ గ్యాప్‌ను పూడ్చేందుకు రెడీ అవుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవితో 'మన శంకర వరప్రసాద్' సినిమా తెరకెక్కిస్తున్న డైరెక్టర్ అనిల్ రావిపూడి.. తమన్నాను ఈ చిత్రంలోని స్పెషల్ సాంగ్ కోసం ఫిక్స్ చేసినట్టు టాక్ వినిపిస్తోంది.

**– అక్షరటుడే, సినిమాడెస్క్**